పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 1.08.2014

ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సామాజిక సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హెచ్ఐసిసిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ అధికారుల సమావేశంలో సర్వే విధి విధానాలు, ఫార్మేట్, కార్యచర్యణనకు సంబంధించి తుది నిర్ణయం తీసుకున్నారు.

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడు తెలంగాణలో నిర్వహించే ఈ సర్వే ద్వారా ప్రజల స్థితిగతులపైన నిజమైన సమాచారం వస్తుందన్నారు. సర్వే నివేదిక రూపొందిన తర్వాతనే ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. ఈ సర్వే సర్వరోగనివారిణి కావాలని అభిలాశించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగులంతా చిత్తశుద్దితో, క్రమశిక్షణతో, నిజాయితీతో నిజాలు సేకరించాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పుడున్న అంచనాల ప్రకారం దాదాపు 84 లక్షల కుటుంబాలు ఉంటాయని వాటన్నింటిని ఈ నెల 19న ఒకే రోజు సర్వే చేయాలని సూచించారు. 19 వ తేదిన ప్రజలంతా కూడా తమ స్వంత గ్రామాల్లోనే ఉండాలని సర్వే సందర్భంగా అన్ని వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. సర్వే సందర్భంగా వివరాలు నమోదు చేసుకోకుంటే ఆ కుటుంబ సభ్యులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందుకునే అవకాశం ఉండదని చెప్పారు. కాబట్టి ప్రజలంతా ఈ సర్వేను అత్యంత ప్రాధాన్యమైన విషయంగా తీసుకోవాలన్నారు. పోలీస్, ఉపాధ్యాయులతో సహా రాష్ట్రంలో ఉన్న 4 లక్షల మంది ఉద్యోగులు సర్వేలో పాల్గొంటారని చెప్పారు. సర్వే జరిగే రోజున ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు సిఎం చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఏలాంటి రెమ్యునరేషన్ లేకుండానే తెలంగాణ అమరవీరుల స్ఫూర్తితో పనిచేస్తామని ప్రకటించారు. ఉద్యోగుల నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి సర్వే రోజు ఆన్ డ్యూటిగా పరిగణిస్తామని, రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా సర్వే బృందాలకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని సిఎం ప్రజలకు పిలుపునిచ్చారు. సర్వే విజయవంతంగా జరిగితే తెలంగాణ రాష్ట్రం దిగ్విజయంగా ముందుకు పోయినట్లేనని చెప్పారు. సర్వే నిర్వహణ కోసం జిల్లాకు రెండు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు సిఎం ప్రకటించారు.

సమావేశంలో ఉద్యోగులకు సిఎం పలు వరాలు ప్రకటించారు. తహశిల్దార్లు, యంపిడిఓలు, ఆర్డిఓలు, ఇతర అధికారులకు వాహన సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. అధికారులకు వాహనాల కొనుగోలు కోసం వడ్డీ లేని రుణం మంజూరు చేయటంతో పాటు అదే వాహనానికి నెల వారి అలవెన్సు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. స్వంత జిల్లాలో తహశిల్దారులు ఉద్యోగం చేయవద్దనే నిబంధనను కూడా రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. స్వంత మండలంలో తప్ప స్వంత జిల్లాలో ఎక్కడైనా పనిచేసే వెసలుబాటు కల్పిస్తామని చెప్పారు. రెవెన్యూ శాఖలో సర్వీసు నిబంధనలను సరళతరం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ఈ నెల 6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని అధికారులను సిఎం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌ను స్మరించుకోవడం తెలంగాణ సమాజపు బాధ్యతగా ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ మెమోరియల్, విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తెలంగాణకు హరిత హారం అనే కార్యక్రమాన్ని వచ్చే జూన్‌లో ప్రారంభిస్తామని, 230 కోట్ల మొక్కలను రాష్ట్ర వ్యాప్తంగా నాటాలని చెప్పారు. రెండు గ్రామాలకు ఒక నర్సరీ వుండే విధంగా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం**